సాక్షి
జనగామ

సోమవారం । 8 । జనవరి । 2024



న్యాక్ పనుల బిల్లుల చెల్లింపులో జాప్యం.. - 8లో▸

బిల్లులు చెల్లించకపోవడంతోనే కేయూ ఉద్యోగి మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబికులు మృతదేహంతో ఆందోళన నిర్వహించారు.



రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం - 8లో▸

రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయమని పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $29^0/19^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం నుంచి చలి పెరుగుతంది. రాత్రి పొగమంచు కురిసే అవకాశం ఉంది.

పుస్తకాలతో కుస్తీ

మెగా డీఎస్సీకి నిరుద్యోగులు సన్నద్ధం

- పెరగనున్న పోస్టుల సంఖ్య
- ఖాళీలు 445 గత టీఆర్టీలో ప్రకటించినవి 76 పోస్టులు
- ప్రణాళికతో సిద్ధమవుతున్న అభ్యర్థులు
- ఆరేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూపులు



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

టీఆర్టీ పోస్టులు

ఎస్ఏ	23
భాషా పండిట్	17
వ్యాయామ	7
ఎస్జీటీ	29
మొత్తం లోకల్ బాడీలో 76 పోస్టులు	

జనగామ రూరల్: మెగా డీఎస్సీ నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ముందస్తుగానే అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువుతున్నారు. చివరిసారిగా 2017–18లో టీఎస్‌పీఎస్సీ ద్వారా టీఆర్టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం నేరుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టింది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయనుంది. కాగా.. ఇప్పటికే జిల్లాలో ప్రకటించిన 76 పోస్టులకు నవంబర్‌లో నిర్వహించాల్సిన టీఆర్టీ పరీక్ష ఎన్నికల కోడ్ కారణంగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం పోస్టుల సంఖ్య పెంచి నిర్వహిస్తామని ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఉత్సాహం పెరిగింది. మరోసారి టెట్ నిర్వహించి పూర్తి స్థాయిలో 20 వేలకు పైగా పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఇందుకు కోసం నెలల కొద్ది గడువు ఉండడంతో అభ్యర్థులు కోచింగ్‌లకు సిద్ధం అవుతున్నారు. అయితే గతంలో పరీక్షా విధానం ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా.. ప్రస్తుతం కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం

గతంలో వెలువరించిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు నిరాశలో ఉన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో పోస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో కెమిస్ట్రీ, ఇంగ్లిష్ పోస్టులు ఖాళీలు లేవు. గత ఆరేళ్ల నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 10 వేల మందికిపైగా అభ్యర్థులున్నారు. కాగా.. మరోమారు టెట్ నిర్వహిస్తే మరింత మంది అర్హత సాధించి పోటీ పడే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా కేవలం 76 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తుండడంతో పోటీ మరింత తీవ్రం కానుంది. మొత్తం జిల్లావ్యాప్తంగా 445 పోస్టులు వివిధ ఎస్ఏ, ఎస్జీటీ పోస్టులు ఖాళీలు ఉండగా.. ప్రమోషన్, ద్వారా 215 భర్తీ కానున్నాయి. మిగిలిన 230 పోస్టులకు కేవలం 76 మాత్రమే ప్రకటించడంతో గతంలో అభ్యర్థులు అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల, బదిలీలు, పదోన్నతులతోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా 19 పాఠశాలలు మూతపడగా.. ఆపాఠశాలలను తెరిపించాలని యోచిస్తోంది. అన్నీ కలిపి పోస్టులను పెంచాలని భావిస్తోంది.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల భర్తీ కనిపించట్లేదు. జిల్లాలోని పలు పాఠశాలల్లో నాలుగైదు ఏళ్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, వ్యాయాయ, ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. కానీ అదే స్థాయిలో భర్తీ లేకపోవడంతో విద్యార్థుల చదువు, భవిష్యత్ ప్రశ్నార్థకంగా తయారైంది. దీనికి తోడు 2018 నుంచి ఉపాధ్యాయల నియామకాలు చేపట్టకపోవడంతో బోధన భారం అధికమవుతోంది. జిల్లాలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 508 ఉండగా.. అందులో సుమారు 2,125 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఖాళీల వివరాలు

జనగామ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో గెజిటెడ్ హెచ్‌ఎంలు 63, పీఎస్ హెచ్‌ఎమ్‌లు 58, ఎస్జీటీలు 118, ఎస్ఏ పీడీ 5, పీఈటీ 7, ఎస్ఏ మాథ్స్ 22, ఫిజిక్స్ 9, బయోసైన్స్ 39, సోషల్ 54, ఇంగ్లిష్ 21, తెలుగు 14, హిందీ 7, లాంగ్వేజ్ పండిట్ తెలుగు 12, లాంగ్వేజ్ పండిట్ హిందీ 9, ఆర్ట్–2, క్రాఫ్ట్–2, ఒకేషనల్–2 మొత్తం 426 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఐదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నా..



గంతలోకంటే అభ్యర్థుల సంఖ్య పెరగడంతో పోస్టుల సంఖ్య పెంచాలి. గత మూడేళ్ల నుంచి టీచర్ ఉద్యోగం కోసం గ్రంథాలయానికి వచ్చి ప్రిపేరవుతున్నా. మా శ్రమ వృథాకాకుండా మెగా డీఎస్సీలో 20 వేల పోస్టులు భర్తీ చేయాలి. ఐదేళ్ల నుంచి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నా.

\- కుసుమ సాయిరాం, జనగామ

కోర్టు కేసుల్లేకుండా నిర్వహించాలి..



గతంలో మాదిరి కాకుండా ప్రభుత్వం ఎలాంటి కోర్టు కేసుల్లేకుండా డీఎస్సీని నిర్వహించాలి. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో పోస్టులు తక్కువగా ఉన్నాయి. వాటి సంఖ్యను పెంచాలి. టెట్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలి. పకడ్బందీగా ప్రిపేరవుతున్నా.. ఈసారి ఎలాగైనా జాబ్ కొడతా.

\- లావుడ్య జవహర్‌లాల్ కొండాపూర్, పాలకుర్తి ఎస్ఏ తెలుగు

సంఖ్య పెంచాలి..



జిల్లాలో 53 వరకు సోషల్ స్టడీస్‌లో ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పోటీపడే వారు మాత్రం వేలల్లో ఉంటారు. సబ్జెక్ట్ వారీగా పోస్టుల సంఖ్యను పెంచాలి. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నిరుద్యోగులను ప్రభుత్వం అన్యాయం చేయకుండా చూడాలి. ప్రమోషన్ల ప్రక్రియ త్వరగా ముగించి పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలి. జిల్లా కేంద్రంలో ప్రత్యేక స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి, గ్రంథాలయంలో మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాలి.

\- ఎన్.మధు, పెంబర్తి, జనగామ

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

జనగామ రూరల్: సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ శివలింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదుకు జిల్లా యంత్రాంగం విధులు నిర్వహిస్తోందని, అధికారులు అందుబాటులో ఉండరని తెలిపారు. ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు ఉండడం వల్ల ప్రజలు ఎవరూ ప్రజావాణి కోసం కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి కనగాల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశాల కోసం పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులకు చివరి గడువు జనవరి 20 వరకు ఉందని తెలిపారు. ఫిబ్రవరి 11న జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని మెరిట్ ఆధారంగా ప్రవేశాలుంటాయని తెలిపారు.

టీఆర్‌వీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్లయ్య



పాలకుర్తి టౌన్: తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి (టీఆర్‌వీఎస్) జనగామ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన మంద ఎల్లయ్య ఎన్నికైనట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు వడిగం ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల చట్టం –2016 అమలుకు, దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ మున్నా, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ నయీమ్, జిల్లా అధ్యక్షుడు అంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు శ్రుతి




కొడకండ్ల: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఉమ్మల శ్రుతి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల జనగామలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శృతిని ఆదివారం ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్, పీఈటీ లలిత, అధ్యాపకులు అభినందించారు.

ఎమర్జెన్సీ ఉన్నా.. ఓపీ చూడరట!

జనగామ: జనగామ ఎంసీహెచ్‌లో 24 గంటలు వైద్య సేవలందించాలి. కానీ.. మధ్యాహ్నం సమయంలో ఓపీ చూడమంటూ ఓ మహిళను డ్యూటీ డాక్టర్లు బయటకు పంపించారు. బచ్చన్నపేటకు చెందిన ఖలీల్ తన కుటుంబసభ్యుల ఆరోగ్యం బాగాలేక ఆదివారం వైద్యం కోసం ఎంసీహెచ్‌కు వచ్చాడు. ఓపీ రశీదు తీసుకునే సమయంలో కేవలం వైద్య పరీక్షలు మాత్రమే చేస్తామని, మధ్యాహ్నం సమయంలో మందులు ఇవ్వమని సిబ్బంది చెప్పారు. అందుకు అంగీకరించిన మహిళ డాక్టర్ వద్దకు వెళ్లింది. ఆతర్వాత ఓపీ ఉదయం మాత్రమే చూస్తామని, ఇప్పుడు కుదరదని చెప్పి పంపించేశారు. ఎమర్జెన్సీ ఉందని మహిళ చెప్పినా వైద్యులు వినిపించుకోలేదు. 'ఇంత పెద్ద ఆస్పత్రి ఉండి ఎందుకు?' అని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. తన ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వస్తే పట్టించుకోని డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని మహిళ కోరింది. కాగా.. ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఖలీల్ తెలిపారు.

రేగుపండ్లకు భలే గిరాకీ



జనగామ: ఆరోగ్య ప్రదాయిని రేగుపండ్లకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో కిలో రూ.80 ధర పలుకుతోంది. అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చిన తర్వాత పట్టణాల్లో రేగు చెట్లు కనుమరుగయ్యాయి. రేగుపండ్లను హైదరాబాద్ నుంచి జనగామకు దిగుమతి చేసుకుంటున్నారు. సంక్రాంతి నాటికి కిలో రూ.120కి చేరుకునే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

కమనీయం.. మల్లన్న కల్యాణం

- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మంత్రులు
- మల్లన్న నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మామిడి తోరణాలు.. మేళతాళాలు.. మంగళ వాయిద్యాలు.. అశేష భక్తజన సమక్షంలో కొమురెల్లి మల్లన్న కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. కొమురెల్లి పుణ్యక్షేత్రంలోని తోటబావి వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామివారి వివాహాన్ని కనులపండువగా నిర్వహించారు. మొదట ఆలయ గర్భగుడిలో ఉదయం 9 గంటలకు మూల విరాట్‌కు కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఊరేగింపుగా కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. ప్రభుత్వం తరఫున స్వామివార్లకు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమర్పించారు.

ఉజ్జయిని పీఠాధిపతి పర్యవేక్షణలో..

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని పీఠాధిపతి జగద్గురు 1,008 సిద్ధలింగ రాజదేశీకేంద్ర శివాచార్య మహాస్వామి పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. మల్లికార్జునస్వామి, బలిజ మేడలమ్మ, గొల్లకేతమ్మల కల్యాణ వేడుకలను వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో మల్లన్న మూల విరాట్ వద్ద అమ్మవార్ల తరఫున మహాదేవుడి వంశస్తులైన సాంబయ్య దంపతులు, వరుడు మల్లికార్జున స్వామి తరఫున పడిగన్నగారి వంశస్తులు మల్లయ్య దంపతులు కల్యాణం జరిపించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య మధ్యాహ్నం 12.28 గంటలకు మేడలదేవి, గొల్ల కేతాదేవిని కోరమీసాల స్వామి కొమురెల్లి మల్లన్న మనువాడారు.

హాజరైన ప్రముఖులు

ఈసందర్భంగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కట్నకానుకలు సమర్పించారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట: అర్హత కలిగిన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెళ్లిలో మల్లికార్జున స్వామి కల్యాణానికి వెళ్తూ.. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆయన ఆగారు. కాంగ్రెస్ నాయకులు శాలువాలతో కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన పాలన అందుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఇష్టం లేని పలు పార్టీల నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని, వారు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని విమర్శించారు. త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో 17 స్థానాలను గెలిపించుకొని సోనియా గాంధీకి కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆముదాల మల్లారెడ్డి, నాయకులు గోళి బుచ్చిరాజు, సత్తయ్య, యాదగిరి పలువురు పాల్గొన్నారు.

'ఎలక్షన్ ఫండ్'లో ఎస్సైలు!


తీగ లాగితే కదులుతున్న డొంక..

- ఇంటెలిజెన్స్ విచారణలో వెలుగుచూస్తున్న వాస్తవాలు
- త్వరలోనే 'ఫండ్' ఇచ్చిన వారిపై ఉన్నతాధికారులకు నివేదిక
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మళ్లీ గెలుస్తారనే ధీమానే కారణం
- ఒక్కొక్కరుగా బయట పడుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'తీగలాగితే డొంక కదిలిన' చందంగా 'ఎన్నికల ఫండ్' ఇచ్చిన పోలీస్ అధికారుల గుట్టు రట్టు అవుతోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పటి వరకున్న ప్రజాప్రతినిధులకు కొందరు సీఐలు, ఒక్కరిద్దరు ఏసీపీలు మాత్రమే 'ఎన్నికల ఫండ్' ఇచ్చారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈఫిర్యాదులు కొన్నిచోట్ల నేరుగా కొందరు ఎమ్మెల్యేల నుంచే అందడంతో సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఓ వైపు ఇంటెలిజెన్స్.. మరోవైపు స్పెషల్ బ్రాంచ్ ఆరా తీస్తుండగా.. ఫండ్ ఇచ్చిన కొందరు ఎస్సైల పేర్లు కూడా వెలుగుచూస్తున్నట్లు సమాచారం.

బాధ్యులపై త్వరలోనే నివేదిక..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పటివరకున్న కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎన్నికల ఫండ్ ఇచ్చిన పోలీస్ అధికారులపై చర్యలకు నివేదికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారవర్గాల్లో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. ఎన్నికల సందర్భంగా అప్పుడున్న సర్వేలు, ప్రచారం ఆధారంగా ఎలాగైనా మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న ధీమా ఒక వైపు.. మరోవైపు పైరవీలు, ఎమ్మెల్యేల లెటర్లతో కీలక పోస్టింగులు పొందిన వారు ఏడాదిలోపే వచ్చిన ఎన్నికల తర్వాత సైతం కొనసాగాలని ఆశపడ్డారు. అయితే, మళ్లీ గెలవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన కొందరు అభ్యర్థులకు కొంతమంది ఇన్‌స్పెక్టర్లు, ఒక్కరిద్దరు ఏసీపీలు రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు 'ఎలక్షన్ ఫండ్' సమకూర్చిన వైనంపై పోలీస్ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. కాగా, ఎన్నికల ఫలితాల తర్వాత ఊహించని రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విషయం బయటకు పొక్కింది. సొంత శాఖ వారే ఈ వ్యవహారాన్ని భూతద్దంలో పెట్టగా ఈనోట ఆనోటా కొత్తగా గెలిచిన కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చేరింది. ఎన్నికల సమయంలో ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా.. 'ఫండ్' సమకూర్చిన సదరు అధికారులపై చర్యలకు పట్టుబడుతుండడం చర్చనీయాంశం అవుతోంది.




పోలీసు గ్రూపుల్లో 'సాక్షి కథనం' వైరల్

'ఎమ్మెల్యే అభ్యర్థులకు పోలీసుల ఫండ్' శీర్షికన ఈనెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై పోలీసువర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్, ఉమ్మడి వరంగల్‌తోపాటు పొరుగు జిల్లాల పోలీసు గ్రూపుల్లో 'సాక్షి' కథనం వైరల్ అవుతోంది. 'ఎస్‌హెచ్‌ఓలుగా ఉన్న ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలే కాదు.. ఎస్సైలు కూడా ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫండ్ ఇచ్చారు' అంటూ పోలీస్ గ్రూపుల్లో కామెంట్ జరుగుతోంది. ఎక్కడెక్కడ.. ఎవరెవరు.. ఎవరెవరికి.. ఎంతెంత మొత్తంలో నిధులు సమకుర్చారన్న అంశాలపై కూడా పోలీసువర్గాల్లో చిట్‌చాట్ జరుగుతోంది. ఆరోపణలు ఎదుర్కుంటున్న వారు, 'ఫండ్' వ్యవహారంతో సంబంధం లేనివారు తమ సహచరులు, సన్నిహితులతో ఒకరిపై ఒకరు పరోక్ష వ్యాఖ్యలు చేసుకుంటుండడం కూడా దుమారం రేపుతోంది.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- జిల్లాలో 7.44 లక్షల ఓటర్లు
- మహిళలే అధికం

జనగామ జిల్లాలో ముసాయిదా ఓటర్ల వివరాలు



నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
జనగామ	1,19,164	1,20,552	09
స్టే.ఘన్‌పూర్	1,24,469	1,26,621	03
పాలకుర్తి	1,26,099	1,27200	11

జనగామ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ఓటరు జాబితా సవరణ–2024 ముసాయిదా జాబితాను శనివారం రాత్రి విడుదల చేశారు. జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాను వెలువరించారు. మూడు నియోజకవర్గాల్లో 7,44,128 ఓట్లు ఉండగా.. ఇందులో మహిళలు 3,74,373, పురుషులు 3,69,732 ఉన్నారు. ఇతర ఓటర్లు 23 మంది ఉన్నారు. కాగా.. పురుషుల కంటే మహిళలు 4,641 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి వరంగల్, జనగామ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ప్రజల నుంచి ఈనెల 22 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. వచ్చే నెల ఫిబ్రవరి 2 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిశీలన పూర్తి చేసి, అదే నెల 8న తుది జాబితాను ప్రకటిస్తారు. ఈఓటరు జాబితా ఆధారంగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తారు.

పాలకుర్తిలో ఎక్కువ..

మూడు నియోజకవర్గాల పరిధిలో పాలకుర్తిలోనే ఓటర్లు అత్యధికంగా నమోదు కాగా.. అత్యల్పంగా జనగామ చివరి స్థానంలో నిలిచింది.

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమయ్య

జఫర్‌గఢ్: రైతులకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నేరవేర్చాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పలు హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. పంట రుణాలకు సంబంధించి రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకం ద్వారా రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతు బంధు డబ్బులు విడతల వారీగా కాకుండా ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి కేవలం కొద్ది మంది రైతులకు మాత్రమే మాఫీ చేసినట్లు తెలిపారు. దీనివల్ల ఎక్కువ మంది రైతులకు లబ్ధి జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం మండల నాయకులు నక్క యాకయ్య, పిన్నింటి సమ్మయ్య, వేల్పుల చిన్న రాములు, ఎండి శంషోద్దీన్, నీరటి కొంరయ్య, బుల్లె దూడయ్య తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు డివిజన్ కేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో చేపట్టిన కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు ఒక చోట కలుసుకుని ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో బాల్యమిత్రుల బృందం అధ్యక్షురాలు బండారి శ్రీలత, కొడ సతీశ్, గొరిశెట్టి సంతోశ్, సునీల్, పెసరు సారయ్య, డాక్టర్ శోభన్‌బాబు, ఏదునూరి సత్యం, నవీన్, రాజేశ్వరచారి, క్రిష్ణమోహన్, సునీల, శ్రీదేవి, భవాని, అనురాధ, శోభ, అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ తదితర కోర్సులకు సంబంధించిన సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నేడు(సోమవారం)నుంచి నిర్వహించనున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఈనెల 8, 10, 12, 16, 18, 20 తేదీల్లో పీజీ (ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్) కోర్సుల పరీక్షలు మధ్యాహ్నం 2గంటలనుంచి నిర్వహిస్తారని తెలిపారు. 49కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,486మంది విద్యార్థులు ఆయా పరీక్షలు రాయబోతున్నారని పేర్కొన్నారు.